క్లుప్తంగా

హెల్మెట్ లేకుంటే రూ.వెయ్యి జరిమానా

చిత్తూరు అర్బన్: ఇప్పటి వరకు హెల్మెట్ లేకుంటే వేస్తున్న రూ.135 జరిమానాకు బదులు ఇక నుంచి రూ.వెయ్యి జరిమానా విధించనున్నట్లు చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. పోలీసులు వాహనాలు తనిఖీ చేసే సమయంలో హెల్మెట్ లేకుంటే పోలీస్ మొబైల్ యాప్‌లో రూ.135 జరిమానా విధించేవాళ్లు. తాజాగా యాప్‌ను అప్‌డేట్ చేయడంతో హెల్మెట్ లేకుంటే రూ.వెయ్యి జరిమానాతో పాటు డ్రైవింగ్ లైసెన్సు రద్దుకు ఆర్టీవోకు సిఫార్సు కూడా చేయనున్నట్లు ఆయన తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సు లేకపోతే రూ.5 వేల జరిమానా పడుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను తప్పనిసరిగా వాడాలని సీఐ కోరారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దాతలు పైమాఘం సుగుణాకర్ రెడ్డి, కరీం

తవణంపల్లె: మండలంలోని గాజులపల్లెలో పరిశుభ్రమైన తాగునీరు అందించడానికి దాతలు సహకారంతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంగళవారం ప్రారంభించారు. దాత, అర్ధగిరి ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ పైమాఘం సుగుణాకర్ రెడ్డి ఆర్థిక సాయంతో మినరల్ వాటర్ యంత్రాలు అందజేశారు. అరగొండ మాజీ సర్పంచ్ జి.కరీం వాటర్ ప్లాంట్ రూంను ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు పరిశుభ్రమైన తాగునీరు అందించడానికి సిద్ధం చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను దాతలు సుగుణాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కరీం చేతుల మీదుగా ప్రారంభించారు. గ్రామస్తులకు పరిశుభ్రమైన నీరు అందించారు. కార్యక్రమంలో జి.గొల్లపల్లె రఘునాథ్ చౌదరి, మైనారిటీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఏకాంబరంరెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న విజయానందరెడ్డి

గుడిపాల: రిటైర్డ్ టీచర్ ఏకాంబరంరెడ్డి(90) మృతి చాలా బాధాకరమని చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి అన్నారు. వసంతాపురం గ్రామానికి చెందిన ఏకాంబరంరెడ్డి అనారోగ్యం కారణంగా మంగళవారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతోపాటు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సర్పంచులు రజనీకాంత్, మధుసూదన్‌రెడ్డి, మధుసూదన్‌రాయల్ నాయకులు చిట్టిబాబు, కెపి శ్రీధర్, కుమారస్వామిరెడ్డి, మండీప్రభ ఉన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం

ఐరాల: గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. పీఎస్.అగ్రహారంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు

బంగారుపాళెం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వాహించినట్లు ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. మండలంలో 104 యూనిట్లకు 945 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వీరందరికీ స్థానిక బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు.

నేడు బిల్లులు కట్టవచ్చు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో బుధవారం విద్యుత్ బిల్లులు కట్టవచ్చని ట్రాన్స్‌కో ఎస్‌ఈలు ఇస్మాయిల్ అహ్మద్, సురేంద్రనాయుడు తెలిపారు. శివరాత్రి సందర్భంగా సెలవురోజు అయినప్పటికీ స్థానికంగా అన్ని విద్యుత్ బిల్లుల చెల్లింపుల కేంద్రాలను అందుబాటులో ఉంచామన్నారు.

ఏడుగురి అరెస్టు

చిత్తూరు అర్బన్: నగరంలో పేకాడుతున్న ఏడుగురి నిందితులను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని పుత్తూరు రోడ్డులో పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సీఐ జయరామయ్య తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా, రవిచంద్రన్, మురళీధర్‌రెడ్డి గ్రూపులకు చెందిన మొత్తం ఏడుగురిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.40 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

సారా విక్రేతల అరెస్టు

చిత్తూరు అర్బన్ : నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పవన్‌కుమార్ తెలిపారు. మంగళవారం పెనుమూరు మండలంలోని అతిమాకులపల్లెలో దాడులు చేసిన ఎక్సైజ్ పోలీసులు చిరంజీవి, నాగరాజును అరెస్టు చేసి 16 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. వీళ్లకు సరఫరా చేసిన ఎర్రమిట్టపల్లెకు చెందిన సుబ్బయ్యపై కేసు నమోదు చేశారు. దాడుల్లో సిబ్బంది దేవప్రసాద్, ఢిల్లీబాబు, రాజేష్, తంబీష్,హేమాద్రి, దీప పాల్గొన్నారు.

చిత్తూరు: 21 అడుగుల శివలింగం, **కాణిపాకం:** నందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న అర్చకులు, **చిత్తూరు:** విద్యుత్ దీపాలంకరణలో రాజుగుడి, విద్యుత్ కాంతుల్లో అగస్త్యేశ్వరస్వామి ఆలయం






మహా శివరాత్రికి ముస్తాబు

- విద్యుత్ కాంతుల్లో శైవక్షేత్రాలు
- ఉదయం నుంచి అభిషేక పూజలు
- ముందస్తు ఏర్పాట్లు పూర్తి
- మొగిలికి ప్రత్యేక బస్సులు



విద్యుత్ దీపాలంకరణలో మొగిలి శివాలయం



ప్రత్యేక అలంకరణలో శివలింగం, నంది

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు నగరంలోని శివాలయాలు మహాశివరాత్రికి ముస్తాబయ్యాయి. ఆలయాలు, పరిసరాలు విద్యుత్ దీపాలంకరణలతో వెలిగిపోతున్నాయి. బుధవారం ఉదయం నుంచి ఆలయాల్లో విశేష పూజలు ప్రారంభంకానున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశారు. నీవానది ఒడ్డున వెలసిన శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. ఉదయం పంచామృత అభిషేకంతో పూజలు ప్రారంభం కానున్నాయి. 8 గంటల నుంచి అభిషేకం, నాల్గవ కాలయాగపూజలు కొనసాగుతాయి. అర్ధరాత్రి లింగోద్భవ దర్శనం ఉంటుందని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

లింగోద్భవ పూజ

కట్టమంచిలో కొలువైన శ్రీ కుళందీశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు అభిషేకాలు నిర్వహిస్తారు. రుద్రాభిషేకంతో పాటు శివపార్వతుల కల్యాణోత్సవం జరుగుతుంది. రాత్రి 11 గంటలకు లింగోద్భవ కాలాన అభిషేకాలు, లక్ష పత్రిపూజ నిర్వహిస్తామన్నారు. ఇరువారంలోని శ్రీ నాగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం స్వామి వారికి అభిషేకాలు, ప్రదోషం, ధూపదీప నైవేద్యం, మహా హారతి నిర్వహిస్తారు. సంతపేటలోని కుబేర ఉమామహేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు జరుగుతాయి. సత్యసాయి సేవా మందిరంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రుద్రాభిషేకం, భక్తులచే పాలాభిషేకం జరుగుతాయి. గిరింపేటలోని చిదంబరేశ్వర స్వామి ఆలయంలో కలశ అభిషేకం, రుద్రాభిషేకం, దీపారాధనలు, నాల్గవ కాల అభిషేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని అర్చకులు పేర్కొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగ ప్రదర్శన

నగరంలోని సూర్య ప్రతాప్ కల్యాణ మండపంలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగాల, సహస్రలింగాల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. అలాగే 21 అడుగుల మహాలింగాన్ని ప్రదర్శించారు. ఈరెండు రోజుల పాటు ఈ ప్రదర్శన జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

ముస్తాబైన శైవక్షేత్రం

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శైవక్షేత్రం మహాశివరాత్రికి ముస్తాబైంది. మహాశివరాత్రి సందర్భంగా శివాలయాన్ని విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరించారు. శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచే కాకుండా పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లను చేశారు. భక్తుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ ఆధ్వర్యంలో బంగారుపాళెం సీఐ శ్రీనివాసులు పర్యవేక్షణలో గట్టి పోలీస్ బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

నందిపై కాలభైరవుడి విహారం

తవణంపల్లె: మండల కేంద్రంలోని కాలభైరేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి నంది వాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం కాలభైరేశ్వర స్వామికి, శివలింగానికి, నందీశ్వరునికి అభిషేకం చేశారు. గంధం, వీబూది, సుగంధ పుష్పాలు, గజమాలలతో ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించి స్వామికి అర్చనలు చేయించారు. రాత్రి నంది వాహన సేవను నిర్వహించారు. స్వామికి పూజా సామగ్రి, ప్రసాదాలు, పండ్లు, పట్టువస్త్రాలు, గజమాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు ఉత్సవమూర్తి అభిషేకం, పూజలు చేయించి ప్రత్యేక అలంకరణలు చేయించారు. సుగంధ పరిమళ పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరించిన పల్లకిలో నంది వాహనంపై కొలువుదీరారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. నంది వాహనంపై కొలువుదీరిన కాలభైరేశ్వరుడు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు స్వామికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాలకు ఉభయకర్తలుగా వినాయకం, కె.వి చంద్రమోహన్ కుటుంబసభ్యులు, వినాయక, దొరబాబు కుటుంబసభ్యులు వ్యవహరించారు.



నంది వాహనంపై విహరిస్తున్న కాలభైరేశ్వరస్వామి

నేడు మహాశివరాత్రి వేడుకలు

ఆలయంలో నేడు మహాశివరాత్రి వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం అంకురార్పణ, కలశప్రతిష్ఠ, గణపతి హోమం, లక్షబిల్వార్చన, శివకోటి భజనలు నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు అన్నదానం, కలశ పూజ, ఊరేగింపు, ప్రదోష కాలంలో నందీశ్వరునికి అభిషేకం, మృత్యుంజయ హోమం, లలితా సహస్రనామం, పూర్ణాహుతి హోమం, శివమాల భక్తుల అగ్నిగుండ ప్రవేశం, శివమాల సమర్పణ, అఖండ కర్పూర హారతితోపాటు రాత్రి 9 గంటలకు భైరవ వాహన సేవ నిర్వహించనున్నట్లు వివరించారు.

అడవికి నిప్పు.. మనుగడకు ముప్పు



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖాధికారి రాకేష్‌కుమార్

ఐరాల: అడవికి నిప్పు పెడితే మానవాళి మనుగడకే ముప్పు వాటిల్లుతుందని మండల అటవీశాఖాధికారి రాకేష్‌కుమార్ అన్నారు. మండలంలోని నాగంవాండ్లపల్లె, రంగమ్మచెరువు గ్రామాల్లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ముఖ్యంగా అడవికి వెళ్లే పశువులు, గొర్రెల కాపరులు అటవీ ఉత్పత్తులను సేకరించి అడవికి నిప్పు పెట్టడం వల్ల క్రమేణా అటవీ విస్తీర్ణం తగ్గిపోతుందన్నారు. అడవిలో తేనె తీసేందుకు నిప్పు పెట్టి వదిలేయడం, బీడీ, సిగరెట్లు కాల్చి నిర్లక్ష్యంగా పడేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇలా చేయడం వల్ల గడ్డితోపాటు వృక్షాలు, చిన్న చిన్న పక్షులు కాలి బూడిద అవుతాయని వివరించారు. అడవుల సంరక్షణకు అడవిలో వంటలు చేయడం, కాపర్లు ఎండు గడ్డిని తగలపెట్టడం, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం నిప్పు పెట్టడం లాంటివి నిషేధించినట్లు తెలిపారు. అడవులకు నిప్పుపెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రమాదాలు తగ్గాలంటే ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది రెడ్డిప్రసాద్, పద్మావతి, శ్రీదేవి, బాబు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ ఈఈగా శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు డివిజన్ ఎన్‌హెచ్ (జాతీయ రహదారుల) విభాగం ఈఈగా శ్రీనివాసులు నియమితులయ్యారు. గతంలో ఈఈగా ఉన్న అబ్దుల్‌సలాం జనవరిలో ఉద్యోగ విరమణ చేశారు. దీంతో రాష్ట్ర రహదారులు భవనాల శాఖ కార్యాలయంలో ఈఈగా పనిచేస్తున్న శ్రీనివాసులును ఇన్‌చార్జి ఈఈగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు పోటుగారి భాస్కర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముందు మంగళవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో 'థాలి –బజావో' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు అలవి కాని హామీలిచ్చి ప్రజలను ఏమార్చి అధికారం చేజిక్కించుకున్నారని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలను తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీసీసీ మాజీ కార్యదర్శి పరదేశి, నాయకులు సుబ్బరాయు, దొరస్వామి, హుమేష్,భాగ్యరాజు, కుమారిరెడ్డి, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులు పద్ధతి మార్చుకోవాలి

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్(కాణిపాకం): రెవెన్యూ సేవల విషయంలో ఉద్యోగులు పద్ధతి మార్చుకుని, పని చేయాలని రూరల్ తహసీల్దార్ లోకేశ్వరి స్పష్టం చేశారు. వీఆర్వో తీరుపై మంగళవారం 'సాక్షి' దినపత్రికలో 'సమాధి ఫొటో తీసుకురండి' అనే శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆమె చిత్తూరు నగరంలోని రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, మండల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కుల, ఆదాయ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ దరఖాస్తులను ఎట్టిపరిస్థితుల్లో పెండింగ్‌లో ఉంచరాదన్నారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు.రెండు నెలలుగా ఏవేవి పెండింగ్‌లో ఉన్నాయో ఆ దరఖాస్తుల వివరాలు తనకు అందించాలని చెప్పారు. రూరల్ వీఆర్వోలు అర్బన్ కార్యాలయానికి వెళ్లాల్సిన పని ఏముందని ప్రశ్నించారు. ఇకపై కేటాయించిన ప్రాంతాల్లోనే పనిచేయాలని సూచించారు. ఎవరైనా డబ్బులు వసూలు చేసినట్లు తేలితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. అర్జీదారుతో అమర్యాదగా వ్యవహరించిన ఆర్ఐను మందలించారు. ఇకపై ప్రజలను విసిగిస్తే ఊరుకోనని చెప్పారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు




తవణంపల్లె: కూరగాయల ప్రదర్శనను పరిశీలిస్తున్న అధికారుల బృందం, అంగన్‌వాడీ లోగోను పరిశీలిస్తున్న అధికారులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలిమిట్టూరు, తుంబకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలనే ఉద్దేశంతో కార్యకర్తలకు ఆరు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. హెచ్‌ఎంలు పార్థసారథి, పట్టాభి, సీడీపీఓ వాణి శ్రీదేవి, సూపర్ వైజర్లు జయశ్రీ, రెడ్డికల్యాణి, రిసోర్సుపర్సన్లు మో హన్‌రెడ్డి, షబానాభాను, ధనుంజయరాజు, చంద్ర, సీఆర్‌పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పూతలపట్టు(కాణిపాకం): పూతలపట్టు మండలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజులపాటు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఎంఈవో వాసుదేవన్, మధుసూధన్‌రెడ్డి అంగన్‌వాడీ కార్యకర్తలకు పూర్వ ప్రాథమిక విద్య బలోపేతంపై శిక్షణ ఇచ్చారు. సీడీపీఓ నిర్మల పాల్గొన్నారు.

పిల్లల నమోదు పెంచాలి

తవణంపల్లె: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల నమోదు పెంచాలని ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి తెలిపారు. హైస్కూల్లో అంగన్‌వాడీ వర్కర్లకు ఆరు రోజుల పాటు నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. అనంతరం అంగన్‌వాడీ వర్కర్లు తయారు చేసిన పలు రకాల పౌష్టికాహారం, తాజా కూరగాయలు, ఆకుకూరలను ప్రదర్శించారు. అంగన్‌వాడీ లోగో ఆకట్టుకుంది. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవరాజులు రెడ్డి, ఐరాల సీడీపీఓ నిర్మల, రిసోర్స్ పర్సన్లు పెద్దబ్బరెడ్డి, మధుబాబు, బాలచంద్రారెడ్డి, భువనేశ్వర్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

సామర్థ్యాలను మెరుగుపరచాలి

ఐరాల: పూర్వ ప్రాథమిక దశలో అభ్యసన సామర్థ్య పునాదులు మెరుగుపరచాలని అంగన్‌వాడీ వర్కర్లకు ఎంఈఓలు రుషేంద్ర బాబు, దామోదర్‌నాయుడు సూచించారు. మంగళవారం జ్ఞానజ్యోతి 120 శిక్షణలో పాల్గొని మాట్లాడారు. ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మల, హెచ్‌ఎం కోమల, సూపర్‌వైజర్ మంజుల, రీసోర్స్ పర్సన్స్ అరుణ్‌కుమార్, జనార్దన్, రేఖ, సుధాకర్ పాల్గొన్నారు.




బంగారుపాళెం: మాట్లాడుతున్న ఎంఈఓ నాగేశ్వర్‌రావు, **ఐరాల:** మాట్లాడుతున్న ఎంఈఓలు

నందీశ్వరుడికి అభిషేకం

కాణిపాకం: కాణిపాకంలోని మణికంఠేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నందీశ్వరుడికి ప్రత్యేక అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రదోషకాల పూజలు చేసి ఏకాలంలో నందీశ్వరుడు, పరమశివుడికి ప్రత్యేక అభిషేకాన్ని అత్యంత వైభవంగా చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని పునీతులయ్యారు.

27న మయాన సేవ ఉత్సవం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అంకాళపరమేశ్వరి అభివృద్ధి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మయానసేవ ఉత్సవాన్ని ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కుమార్ తెలిపారు. చిత్తూరు నగరం గుర్రప్పనాయుడువీధిలోని శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం సాయంత్రం వారు మయానసేవ(శ్మశానకొల్ల) ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బుధవారం మహా శివరాత్రిపూజలు జరుగుతాయన్నారు. మరుసటి రోజు అంటే గురువారం నీవానది ఒడ్డున మయానసేవ ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో అమ్మవారు భూతవాహనంపై విహరిస్తూ ఒడ్డుకు చేరుకున్న తర్వాత దక్షసంహారం జరుగుతుందన్నారు. శుక్రవారం సోది అలంకారం ఉంటుందని చెప్పారు.

నిత్య అన్నదానానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన నిత్య అన్నదాన ట్రస్టుకు ఓ దాత మంగళవారం నగదు విరాళం చేశారు. విజయవాడకు చెందిన నరసింహామూర్తి రూ. లక్ష విరాళ నగదును అందజేశారు. అనంతరం దాత కుటుంబ సభ్యులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదం అందించారు.

రేపు పీఎంపీ క్రికెట్ టోర్నమెంట్

యాదమరి(కాణిపాకం): యాదమరి మండలం పెరుమాళ్లపల్లిలో గ్రౌండ్‌లో బుధవారం నుంచి పీఎంపీ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించనున్నట్లు ఆ గ్రామ పెద్దలు, టీమ్ సభ్యులు తెలిపారు. పోటీలో గెలుపొందితే, ప్రథమ బహుమతి రూ.11,999, రెండో బహుమతి రూ.6,499, మూడవ బహుమతి 3,499 నగదు బహుమతి ఉంటుందని వారు పేర్కొన్నారు.